సాక్షి వనపర్తి

బుధవారం ; 23 ; జూలై ; 2025



మోడల్ స్కూల్ కంపు కంపు

ధన్వాడలోని మోడల్ స్కూల్ అపరిశుభ్రతకు నిలయంగా మారి కంపు కొడుతోంది.

వివరాలు 8లో ▸



అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

గద్వాల పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.4 /22.2

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



వనపర్తి రూరల్: మండలంలోని గాయత్రి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రజని పాల్గొని విద్యార్థులకు మోటారు వెహికల్, పోక్సో, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, ఉచిత న్యాయ సాయం గురించి అవగాహన కల్పించారు. విద్యాసంస్థల్లో కొత్తగా చేరే విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేసే ప్రమాదం ఉందని, ర్యాగింగ్‌తో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ర్యాగింగ్‌కు స్వస్తి పలికేందుకు ప్రత్యేక చట్టాలు రూపొందించారని వివరించారు. ప్రతి విద్యార్థితో ర్యాగింగ్‌కు పాల్పడమని అంగీకార పత్రం తీసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాలకు టోల్‌ఫ్రీ నంబర్ 15100 సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రఘువీరారెడ్డి, కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పంచముఖికి ప్రత్యేక బస్సు

వనపర్తిటౌన్: అమావాస్యను పురస్కరించుకొని గురువారం పంచముఖి పుణ్యక్షేత్రానికి వనపర్తి డిపో నుంచి ప్రత్యేక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న మధ్యాహ్నం 12 గంటలకు వనపర్తి నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు పంచముఖికి చేరుకుంటుందన్నారు. దర్శనానంతరం మంత్రాలయానికి వెళ్లి తిరిగి పంచముఖికి చేరుకొని రాత్రి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు వనపర్తికి వస్తుందని వివరించారు. టిక్కెట్ ధర రూ.600గా నిర్ణయించామని.. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్లు 99592 26289, 73828 29379 సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి



వనపర్తి విద్యావిభాగం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం పాఠశాలలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చామని.. విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించి విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.పవన్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రామకృష్ణ, అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎంప్లాయిమెంట్ శాఖ ఆధ్వర్యంలో 24వ తేదీ (గురువారం)న జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి మైత్రి ప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ రంగంలో 500 ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 99485 68830, 89193 80410 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గడువు పొడిగింపు

గద్వాల: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తు తేదీని ఆగస్టు 31వ తేదీవరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నుషిత ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంలో ఈ విద్యా సంవత్సరం నుంచి 210 సీట్ల నుంచి 500 సీట్ల వరకు పెంచినందున ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు www.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమృత్ 2.0.. ఆలస్యం

జిల్లాలోని పురపాలికలకు రూ.128.29 కోట్లు మంజూరు



అమరచింత ఉన్నత పాఠశాల ఆవరణలో తాగునీటి ట్యాంకు నిర్మాణం

- గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభం
- నేటికీ పైప్‌లైన్లు కూడా పూర్తికాని వైనం
- పెబ్బేరు, కొత్తకోటలో మరింత ఆలస్యం

అమరచింత: మున్సిపల్, అర్బన్, నగరపాలక ప్రాంతాల్లోని ప్రజలకు శాశ్వతంగా శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని ప్రారంభించి రూ.కోట్లు వెచ్చిస్తున్నా పనుల్లో పురోగతి మాత్రం కనిపించడం లేదు. జిల్లాలోని 5 పురపాలికలకు రూ.128.29 కోట్లు కేటాయించి జనాభా ప్రాతిపదికన తాగునీటి సరఫరాకు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. పనులు దక్కించుకున్న ఓ కంపెనీ ఆరంభంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినా.. నేటికి ఆయా పురపాలికల్లో 50 శాతం పనులు సైతం పూర్తిగాని పరిస్థితి ఉంది.

2024, ఆగస్టులో పనులు ప్రారంభం..

కేంద్రం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా గతేడాది ఆగస్టులో తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణాలను జిల్లాలోని వనపర్తి, అమరచింత, ఆత్మకూర్ పురపాలికల్లో ప్రారంభించిన అధికారులు కొత్తకోట, పెబ్బేరులో ట్యాంకుల నిర్మాణాలకు స్థలాల కేటాయింపులో జాప్యం జరిగింది. రెండు నెలల కిందటే ఆయా పురపాలికల్లోనూ పనులు ప్రారంభించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా.. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుండటంతోనే పనులు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పైప్‌లైన్ నిర్మాణ పనులు (ఫైల్)

పనులు త్వరగా పూర్తి చేయండి..



పట్టణంలో అమృత్ 2.0 పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది పనులు ప్రారంభంకాగా.. ఇప్పటి వరకు సగం కూడా పూర్తి చేయలేదు. పట్టణంలో ఇప్పటికే తాగునీటి సమస్య అధికంగా ఉంది. బీసీకాలనీలోని 6, 7 వార్డుల్లో చేతి పంపులు, పుర కొళాయిలు ఉన్నా నీటి సరఫరా సక్రమంగా జరగక ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– వెంకటేష్, అమరచింత

కొత్త కాలనీల్లోనూ చేపట్టాలి..



పురపాలికల్లో కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో తాగునీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం అమలు చేస్తున్న కొత్త పథకాన్ని తాగునీరు అందని వార్డులకు విస్తరించి పనులు చేపట్టాలి. అప్పుడే పట్టణ ప్రజలకు నిత్యం తాగునీరు అందుతుంది.

– లాల్‌కోట రవి, కొత్తకోట

నిర్దేశిత గడువులోగా..

జిల్లాలోని అన్ని పురపాలికల్లో ఇచ్చిన లక్ష్యం మేర పనులు చేపడుతున్నాం. ఇప్పటికే వనపర్తి, అమరచింత, ఆత్మకూర్లో పనులు కొనసాగుతుండగా.. మిగిలిన కొత్తకోట, పెబ్బేరులోనూ పనులు చేపట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీటిని అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ, ప్రజారోగ్యశాఖ, మహబూబ్‌నగర్ డివిజన్

పురపాలికల వారీగా ఇలా..

వనపర్తి పురపాలికకు మిషన్ 2.0 పనులకుగాను రూ.72.36 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 55 లక్షల జనాభాకు సరిపడా నీటిని అందించేందుగాను పైప్‌లైన్, వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. 5,300 కిలో లీటర్ల సామర్థ్యంగల 8 ట్యాంకులు, 200 కేఎల్‌ల సామర్థ్యం గల సంప్, పట్టణంలో 60 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి 48 వేల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది.

- కొత్తకోట పురపాలికకు రూ.14.95 కోట్లు మంజూరుకాగా.. 2,100 కిలో లీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంకులు, 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తిచేసి 1,260 ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది.
- పెబ్బేరు పురపాలికకు రూ.10.76 కోట్లు మంజూరు కాగా 21 లక్షల లీటర్ల నీటిని అందించేందుకు రెండు ట్యాంకులు, 25 కిలో మీటర్ల పైప్‌లైన్ వేసి 1,900 ఇళ్లకు నీటిని అందించాలి.
- ఆత్మకూర్ పురపాలికకు రూ.17.22 కోట్లు మంజూరుకాగా 25 లక్షల లీటర్ల సామర్థ్యంగల రెండు వాటర్ ట్యాంకులు, 16 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి వెయ్యి ఇళ్లకు నీటివసతి కల్పించాలి.
- అమరచింత పురపాలికకు 11 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులు, 16 కిలో మీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి వెయ్యి ఇళ్లకు కొళాయిలను ఏర్పాటు చేయడానికి రూ.13 కోట్లు మంజూరు చేశారు.

పకడ్బందీగా ఏఐ విద్యాబోధన



ఏఐ విద్యాబోధన సమీక్షలో కలెక్టర్ ఆదర్శ్ సురభి.. ప్రధానోపాధ్యాయులు

వనపర్తి: ఏఐ విద్యాబోధనను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఒకే చోట ఉండి కంప్యూటర్లు ఉన్న 23 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా సామర్థ్యాలు తక్కువగా విద్యార్థులను గుర్తించి రోజు అరగంట పాటు ఏఐ బోధన చేపట్టాలన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఏఐ బోధన ప్రారంభమైందని.. మిగిలిన పాఠశాలల్లో ఇంటర్నెట్, హెడ్‌సెట్ ఏర్పాటు చేసుకొని ప్రారంభించాలని కోరారు. ఇందుకు టైంటేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఉదయం 10 నుంచి కంప్యూటర్ తరగతులు ప్రారంభం కావాలన్నారు. 23 పాఠశాలల్లో ప్రస్తుతం 117 పనిచేస్తున్న కంప్యూటర్లు ఉన్నాయని విద్యాశాఖ ఏఎంఓ మహానంది తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ (ఎగ్జామినేషన్) గణేష్, జీసీడీఓ శుభలక్ష్మి, శేఖర్ పాల్గొన్నారు.

వేగంగా ‘రెవెన్యూ’ దరఖాస్తుల పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని.. ఇందుకోసం అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని, విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారికి సూచించామన్నారు. సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో కేసుల పరిష్కారం



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్.. హాజరైన పోలీసు సిబ్బంది

వనపర్తి: ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని అన్ని ఠాణాల కానిస్టేబుళ్లకు పని విభాగాల నిర్వహణపై ఇచ్చిన శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లలో కేసులు పెండింగ్ ఉండకుండా చూడాలని, కేసు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్, పంచనామా, స్టేట్‌మెంట్ నమోదు గురించి శిక్షణలో క్షుణ్ణంగా నేర్చుకోవాలని కోరారు. కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, కేసుల ఛేదనలో ఆధునిక సాంకేతికతను ఎలా వినియోగించాలో వివరించారు. శిక్షణ మూడురోజుల పాటు కొనసాగుతుందని.. ఠాణాలకు వెళ్లిన తర్వాత తోటి సిబ్బంది, సంబంధిత అధికారికి శిక్షణ కాలంలో నేర్చుకున్నది సవివరంగా తెలియజేయాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేసుల విచారణలో పరిపక్వత సాధించాలనే నిష్ణాతులైన సిబ్బందితో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని.. నిరంతరం ప్రజలకు రక్షణగా నిలుస్తాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేయాలని ఇక్కడి నుంచే పర్యవేక్షణ చేస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ అంజద్, ఐటీ కోర్ టెక్నికల్ టీం సిబ్బంది, గోవింద్, రవీందర్‌బాబు, పోలీసు సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

రూ.100 కోట్ల పంట రుణాలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి.. హాజరైన పీఏసీఎస్ సభ్యులు

పాన్‌గల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రూ.100 కోట్ల పంట రుణాలు ఇవ్వనున్నట్లు డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సహకార బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను సకాలంలో పునరుద్ధరించుకుంటే వడ్డీ తగ్గుతుందని.. దీనిని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. సహకార సంఘం పరిధిలో గ్రామానికి 10 మంది రైతులను ఎఫ్‌పీఓ ద్వారా వ్యాపారాలు, ఆహార ఉత్పత్తులు పెంచేందుకు సభ్యులుగా చేర్చుతామని.. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు ఉత్పత్తులు పెంచుతామన్నారు. పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలను కూడా అందిస్తున్నామని.. కర్షకమిత్ర ద్వారా 2 నుంచి 4 ఎకరాలున్న రైతులకు ఎకరాకు రూ.4 లక్షల చొప్పున మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాన్‌గల్ సింగిల్‌విండో ద్వారా రైతులకు రూ.కోటి వరకు రుణాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేస్తామని తెలిపారు. ముఖ్యంగా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని అపోహలను నమ్మవద్దన్నారు. మండలంలోని కేతేపల్లిలో ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని చెప్పారు. విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, సీఈఓ భాస్కర్‌గౌడ్, విండో డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, బాలరాజు, బీరయ్య పాల్గొన్నారు.

‘ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్’




మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి రూరల్: కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయనతో పాటు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లబ్ధిదారులను మోసం చేస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు యాదవ్, సత్యనారాయణ, శివ, నరేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ఏం జరుగుతోంది?

నాన్ టీచింగ్ సిబ్బందిపై వేధింపుల పర్వం

- ఇటీవల పలువురిపై సస్పెన్షన్ వేటు
- చిన్నపాటి తప్పిదాలకే విచారణ కమిటీల ఏర్పాటు
- వేతనాలపై ప్రశ్నిస్తున్నందుకే ఇదంతా చేస్తున్నారని ఆరోపణలు
- టీచింగ్ సిబ్బందిలో సైతం అధికారుల తీరుపై తీవ్ర అసహనం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఉన్నతస్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బందిపై వేధింపుల పర్వానికి తెరలేపారు. గత కొన్నిరోజుల వ్యవధిలోనే ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసి తమలోని అక్కసును బయటపెట్టుకున్నారు. దీంతో పాటు నాన్‌టీచింగ్ సిబ్బంది చేసే చిన్నపాటి తప్పిదాలకే విచారణ కమిటీలు వేసి భయాందోళనకు గురిస్తున్నారు. వేసవిలో యూనివర్సిటీకి సెలవులు ప్రకటించిన అధికారులు.. నాన్‌టీచింగ్ సిబ్బందికి మాత్రం ఒక్క సెలవు ఇవ్వలేదు. సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన సిబ్బందిని కనీసం అధికారులు వారి చాంబర్‌లోకి కూడా రానివ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కేవలం తమకు వేతనాలు పెంచమని కోరినందుకే అణచివేత ధోరణికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీయూలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందిలో కిందిస్థాయి వారికి రూ.6 వేల నుంచి మధ్యస్థాయి వరకు రూ.15 వేల వరకు వేతనాలు ఇస్తున్నారు.

ఏం మాట్లాడితే ఏం చేస్తారో..

మూడు రోజుల క్రితం విధుల్లో ఉన్న పీయూ పీజీ కళాశాల ఓ మహిళా నాన్‌టీచింగ్ సిబ్బంది తన కొడుకుకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్తుండగా.. రిజిస్ట్రార్ అడ్డుకుని సదరు మహిళను సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రార్ తీరుతో నాన్‌టీచింగ్ సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎలాంటి విచారణ, హెచ్చరిక, నోటీస్ లేకుండా సస్పెన్షన్ వేటు వేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటు గతంలో ఓ టీచింగ్, ఓ నాన్‌టీచింగ్ గొడవపడిన వ్యవహారంపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేసిన అధికారులు నేరుగా నెల రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు సమాచారం. మరో ఇద్దరు సిబ్బంది చిన్నచిన్న తప్పిదాలు చేశారన్న ఆరోపణలతో వారిపై ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీలు వేశారు. దీంతో ఏం మాట్లాడితే.. ఏం చేస్తారోనన్న భయాందోళన నాన్ టీచింగ్ సిబ్బందిలో నెలకొంది.

టీచింగ్ సిబ్బందిలోనూ అసంతృప్తి..

పీయూలో ప్రొఫెసర్ స్థాయి లెక్చరర్లు ఉన్నప్పటికీ రిజిస్ట్రార్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తీసుకోవడంపై రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అంతేకాకుండా గతంలో అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసిన వారికి ఎలాంటి పదవులు ఇవ్వకుండా వారిని దూరంగా పెట్టడం, సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఇటీవల అన్ని హాస్టళ్లకు కలిపి ఒక రెగ్యులర్ అధ్యాపకుడిని చీఫ్ వార్డెన్‌గా నియమించారు. ఇందులో రెండు బాలికల హాస్టళ్లు సైతం ఉన్నాయి. ఈ క్రమంలో బాలికల హాస్టల్‌కు గతంలో ఉన్న చీఫ్ వార్డెన్ (మహిళ)ను తప్పించి పురుష అధికారిని నియమించారు. బాలికల హాస్టల్‌లో సమస్యలు, ఇబ్బందులు వస్తే వారు ఆయనకు ఎలా చెప్పుకుంటారనే ప్రశ్న తలెత్తుతోంది.

బదిలీల పరంపర..

నాన్‌టీచింగ్‌లో రెగ్యులర్ ప్రతిపాదిక పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు సైతం వేధింపులు తప్పలేదు. తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఆయనను ఎలాంటి కారణం చెప్పకుండా నేరుగా ఎగ్జామినేషన్ విభాగానికి బదిలీ చేశారు. అంతేకాకుండా మరో నాన్‌టీచింగ్ సిబ్బందిని సరిగా విధులకు రావడం లేదన్న కారణంతో ఫార్మసీ కళాశాలకు బదిలీ చేసి.. అక్కడి నుంచి గద్వాల పీజీ కళాశాలకు బదిలీ చేసి అక్కడి వెళ్లాలని సూచించారు. చాలా రోజులుగా వైస్ చాన్స్‌లర్‌ను కలిసి సమస్యను చెప్పుకోవడానికి ప్రయత్నిస్తే కనీసం చాంబర్‌లోకి సైతం రానివ్వలేదని తెలిసింది. అంతేకాకుండా మరో మహిళా సిబ్బందిని ఎలాంటి కారణం లేకుండా నేరుగా ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. గతంలో తప్పిదాలు చేసి బదిలీపై వెళ్లిన వారిని ప్రస్తుత అధికారులు పైరవీలు చేసి తిరిగి అడ్మినిస్ట్రేషన్ బ్రాంచ్‌కు రప్పించుకుంటున్నట్లు సమాచారం. మరో ఇద్దరిపై విచారణ కోసం కమిటీలు వేసి, వారి వివరణ సైతం తీసుకుంటున్నారు. ఇలాంటి ధోరణితో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

సిబ్బంది తరఫున పోరాడతాం..



సిబ్బంది చిన్నచిన్న తప్పిదాలు చేస్తే వారిని విచారణ చేయాలి.. నోటీసులు ఇవ్వాలి.. కానీ, నేరుగా సస్పెండ్ చేయడం అనేది సిబ్బందిని వేధింపులకు గురిచేయడమే. బాధిత సిబ్బంది తరఫున మేము పోరాటం చేస్తాం. అధికారులు అణచివేత ధోరణి అవలంబించడం సరైంది కాదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అధికారుల వ్యవహారశైలిని ఖండిస్తున్నాం. వేతనాలు పెంచకుండా సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయవద్దు.

– రాము, పీయూ ఎస్‌ఎఫ్ఐ నాయకులు

అందరినీ సమానంగా చూస్తాం..



పీజీ కళాశాలలో సిబ్బంది నేరుగా సంతకం పెట్టి వెళ్లిపోతున్నట్లు తెలిసింది. అప్పటికే సంతకం పెట్టి బయటికి వెళ్తున్న ఓ సిబ్బందిని ఎక్కడికి వెళ్తున్నావని అడిగా.. సంతకం పెట్టి బయటికి పోతే ఎలా అని సస్పెండ్ చేశాం. ఏ సిబ్బంది పైనా మాకు కోపం లేదు. అందరినీ సమానంగా చూస్తాం. వేతనాల పెంపు కోసం కృషి చేస్తున్నాం. వేసవి సెలవుల్లో నాన్ టీచింగ్ సిబ్బందికి సెలవులు ఉండవు. గతంలో సెలవులు ఎలా ఇచ్చారో నాకు తెలియదు.

– రమేష్‌బాబు, రిజిస్ట్రార్, పీయూ

క్లుప్తంగా

రైలు ఢీకొని గొర్రెల కాపరి దుర్మరణం

మక్తల్: రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన కోనేమోల బాల్‌రాజ్(56) గ్రామ సమీపంలో రైలు పట్టాల వద్ద గొర్రెలు కాపు కాస్తుండగా రైలుపట్టాల మీద ఉన్న గొర్రెలను తరలిస్తుండగా రైలు ఢీకొనడంతో తల ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య గోవిందమ్మ, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


బొప్పలి నర్సింహులు (ఫైల్)

ధరూరు: క్షణికావేశంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కోతులగిద్దలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొప్పలి నర్సింహులు(35) మండల కేంద్రంలో టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14న తన వ్యవసాయ పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పేకాట, మద్యానికి బానిసై పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోగా క్షణికావేశంలో పురుగు మందు తాగినట్లు ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య బొప్పల హేమలత ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం నర్సింహులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


చికిత్స పొందుతూ మహిళ మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకు చెందిన అంజలి (30) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన అంజలి కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంటి వద్ద గడ్డి మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అంజలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

మరికల్: పాతకక్షల నేపథ్యంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందుతుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ నెల 19న రాత్రి మరికల్‌లో లంబడి వెంకటేష్‌పై బొండాల మల్లేష్ అనే వ్యక్తి కొబ్బరి బొండాల కత్తితో దాడిచేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో సీఐ రాజేందర్‌రెడ్డి నిందుతుడిని కోస్గి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఇచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాము, ప్రత్యేక పోలీస్ టీమ్ పాల్గొన్నారు.

రెండోరోజూ గాలింపు.. లభించని ఆచూకీ



ధరూరు: జూరాల ప్రాజెక్టులో గల్లంతైన మహేష్ ఆచూకీ కోసం రెండోరోజు మంగళవారం ఉదయం నుంచి రేవులపల్లి పోలీసులు, జాలర్లు, రెస్క్యూ టీం సభ్యులు గాలింపు చేపట్టారు. ప్రాజెక్టు క్రస్టుగేట్ల ముందు భాగంలో అడుగడుగునా గాలించారు. జల విద్యుత్ కేంద్రం వైపు గేట్లు మూసి అటు ఆత్మకూర్ వైపు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం పొద్దుపోయే వరకు గాలింపు కొనసాగినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

- రూ.15 లక్షల విలువైన సిగరెట్లు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు


స్వాధీనం చేసుకున్న సిగరెట్ డబ్బాలు

గద్వాల క్రైం: గోదాంలో నిల్వ చేసిన రూ.18 లక్షల విలువైన సిగరెట్లను అపహరించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వివరించారు. అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ రెండేళ్లుగా అయిజలో విజయలక్ష్మి ఏజెన్సీ ఏర్పాటుచేసి సిగరెట్ల వ్యాపారం చేస్తున్నారు. అయితే ఈ నెల 11న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏజెన్సీ సముదాయంలో నిల్వ చేసిన సిగరెట్ డబ్బాలను అపహరించారు. ఈ ఘటనపై బాధితుడు 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పలు బృందాలతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

రాజస్థాన్‌లోని పైలా జిల్లా బితులాకు చెందిన రతన్‌లాల్, జలోర్ జిల్లాకు చెందిన బీర్బల్ బిష్ణయ్, గుణదేవ్ గ్రామానికి చెందిన జగదీష్‌లు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. ఈ నెల 11న కారులో కర్ణాటకలోని బెల్గాం నుంచి అయిజకు కారులో వచ్చారు. పట్టణంలోని విజయలక్ష్మి ఏజెన్సీ ద్వారా భారీ మొత్తంలో సిగరెట్ల వ్యాపారం కొనసాగుతుందని గుర్తించి అదేరోజు అర్ధరాత్రి దుకాణ సముదాయం నుంచి రూ.18 లక్షల విలువైన సిగరెట్ కాటన్ డబ్బాలను కారులో వేసుకొని ఎరిగెర మీదుగా రాయచూర్‌కు చేరుకున్నారు. దొంగిలించిన సిగరెట్ బాక్స్‌లను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు 21వ తేదీన శాంతినగర్ సీఐ టాటాబాబు ప్రత్యేక బృందంతో రాయచూర్‌కు వెళ్లగా పట్టణ శివారులో సిగరెట్ బాక్సులతో ఉన్న కారు, రతన్‌లాల్, జగదీష్ కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారన్నారు. బీర్బల్ విష్ణయ్ పరారీలో ఉన్నారని ఇద్దరు నిందితులతో పాటు రూ.15 లక్షల విలువైన సిగరెట్ బాక్సులు, రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితులను మంగళవారం గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రెడ్డి, అబ్దుల్ షుకూర్, సిబ్బంది రంజిత్, ప్రసాద్, గోవింద్, రవికుమార్, శ్రీను ఉన్నారు. కేసును ఛేదించిన సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక క్యాష్ రివార్డులను అందజేశారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద


జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

8 క్రస్టు గేట్ల ఎత్తివేత.. దిగువకు నీటి విడుదల

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వరద మళ్లీ పెరిగింది. సోమవారం ప్రాజెక్టుకు 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 9 గంటల వరకు 1.02 లక్షల క్యూసెక్కులకు పెరిగిందని పీజేపీ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 68 వేల క్యూసెక్కులు రాగా.. రాత్రికి వరద భారీగా పెరిగింది. దీంతో ప్రాజెక్టు 8 క్రస్టు గేట్లను 32,752 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 36,278, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–1కు 650, నెట్టెంపాడుకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 645, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, భీమా లిఫ్టు–2కు 750, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కులు వదలగా.. మరో 66 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ముమ్మరంగా విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం ఎగువలో 5 యూనిట్ల ద్వార 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో..

జూరాల ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 49,551 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు దిగువనున్న నారాయణపూర్‌కు 51,160 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 54,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

సుంకేసులకు 43 వేల క్యూసెక్కులు

సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి మంగళవారం 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో 9 గేట్లను తెరిచి శ్రీశైలానికి 39,411 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

ప్రేమించిన మరదలితో వివాహం చేయడం లేదని..


విషాదంలో కుటుంబ సభ్యులు

- యువకుడి అదృశ్యం
- కృష్ణానదిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడమోనని గ్రామస్తుల అనుమానం
- ఆందోళనలో కుటుంబ సభ్యులు


పరశివ

కృష్ణా: ప్రేమించిన మరదలితో కుటుంబ సభ్యులు వివాహం చేయడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇక సెలవు (మిస్‌యూ మా, మిస్‌యూ ఆల్ మై ఫ్రెండ్స్, ఫ్యామిలీ) అంటూ తన ఫోన్‌లో స్టేటస్ పెట్టి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని చేగుంటలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. చేగుంటకు చెందిన సంగెంబండ బస్సప్ప – తిమ్మవ్వ దంపతులకు మల్లప్ప, భీమ్‌రాయ, పరశివ సంతానం. వీరి తల్లి తిమ్మవ్వ కొన్నేళ్ల క్రితం మృతిచెందగా.. మొదటి కొడుకు మల్లప్ప తన భార్యతో కలిసి జీవనోపాధి నిమిత్తం బెంగళూరుకు వలస వెళ్లారు. ఆరేళ్ల క్రితం పదో తరగతి పూర్తిచేసుకున్న చిన్నకొడుకు పరశివ (22) కూడా ఉపాధి నిమిత్తం బెంగళూరులోని తన అన్న మల్లప్ప వద్దకు వెళ్లాడు. బెంగళూరులో పరశివ పనిచేసుకుంటూ.. తన రెండో అన్న భీమ్‌రాయ భార్య సునీత చెల్లెలు నిఖితతో ప్రేమలో పడ్డాడు. వీరిద్దరు వరుసకు బావమరదలు కావడంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని స్వగ్రామంలో ఉన్న తన సోదరుడు భీమ్‌రాయ, వదిన సునీతకు చెప్పేందుకు గాను వారం రోజుల క్రితం పరశివ బెంగళూరు నుంచి చేగుంటకు వచ్చాడు. ఈ క్రమంలో పరశివ, నిఖిత వివాహానికి అన్న, వదినలు అడ్డు చెప్పారు. ప్రేమించిన యువతి ఆరోగ్యం బాగా లేదని, నీకు మరో అమ్మాయితో వివాహం చేస్తామని పరశివకు సర్దిచెప్పారు. ఇక వీరి మాటకు ఎదురు చెప్పలేక తిరిగి బెంగళూరుకు బయలుదేరాడు. ఆదివారం బెంగళూరు నుంచి మళ్లీ బయలుదేరిన పరశివ.. రాష్ట్ర సరిహద్దులోని దేవసూగూర్‌లో గల కృష్ణానది తీరానికి చేరుకున్నట్లు తెలిసింది. అక్కడ తన ఫోన్‌లో 'మీస్‌యూ ఆల్ మై ఫ్రెండ్స్, అండ్ ఫ్యామిలీ' అంటూ స్టేటస్ పెట్టాడు. అలాగే తాను ప్రేమించిన నిఖితతో దిగిన ఫొటోలు, వీడియోలు స్టేటస్‌లో పెట్టుకొని ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మొదట కృష్ణా, ఆ తర్వాత శక్తినగర్ పోలీసులకు సమాచారం అందించారు. అయితే కృష్ణానదిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడేమో అని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానికుల సహాయంతో కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టగా.. ఆచూకీ లభించలేదు. యువకుడి అదృశ్యం ఘటనకు సంబంధించి శక్తినగర్ ఎస్‌ఐ తిమ్మణ్ణను వివరణ కోరగా.. ఈ విషయంపై బెంగళూరులో కేసు నమోదైందని త తెలిపారు. తాము స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. ఇప్పటికే బెంగళూరులో కేసు నమోదైనందున తాము కేసు చేయలేదని తెలిపారు.

దొంగల స్వైర విహారం


చోరీ జరిగిన ఓ ఇంట్లో బీరువా తెరిచిన దొంగలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఐదు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. చోరీలో దాదాపు 5 తులాల బంగారం, 50 వేల వరకు నగదు అపహరించినట్లు బాధితులు వాపోయారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు బాధితులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన అనిల్ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, రూ.15 వేల నగదు, చంద్రయ్య ఇంట్లో రూ.20 వేల నగదు, బంగారు ఆభరణాలు, కృష్ణయ్య ఇంట్లో రూ.10,000 నగదు, నరసింహారెడ్డి, మైనుద్దీన్ ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన బాధితులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి క్లూస్‌టీంతో కలిసి పరిశీలించారు.

వివాహేతర బంధమే ప్రాణం తీసింది

- హత్య చేసింది ప్రియురాలి కుటుంబీకులే..
- నిందితులను అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, వెనుక నిందితులు

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దామోదర్‌గౌడ్(48) హత్యకు వివాహేతర బంధమే కారణమని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను మంగళవారం కొల్లాపూర్ సీఐ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 11న రాత్రి దామోదర్‌గౌడ్ ఇంటిపై పడుకుంటానని భార్య నిర్మలకు చెప్పి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు దామోదర్‌గౌడ్ కనిపించకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తెలిసిన వారికి భార్య నిర్మల ఫోన్ చేసింది. ఎంతకూ ఆచూకీ తెలియకపోవడంతో 13న పెద్దకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో నిర్మల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే దామోదర్‌గౌడ్‌కు అదే గ్రామానికి చెందిన బుసిగారి వెంకటమ్మ అనే మహిళతో వివాహేతర సంబంధం ఉందని, దీనిపై గతంలో వారి కుటుంబీకులతో గొడవలు జరిగాయని, వారిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సింగోటం చెరువులో ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలుతుందని మత్స్యకారులు చెప్పడంతో దాన్ని వెలికితీశారు. దామోదర్‌గౌడ్‌గా నిర్ధారించి తలకు గాయాలైనట్లు గుర్తించి పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు.

బంధువుల ఇంట్లో తలదాచుకొన్నారు

ఈ క్రమంలో మంగళవారం వెంకటమ్మ, కుటుంబీకులు పెద్దకొత్తపల్లిలో బంధువుల ఇంట్లో ఉన్నారన్నా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో 11వ తేదీ రాత్రి వెంకటమ్మ ఇంటికి దామోదర్‌గౌడ్ రాగా ఆమె భర్త బిచ్చయ్య, కుమారుడు కుర్మయ్యకు మధ్య వాగ్వాదం జరగడంతో కర్రలతో దాడిచేసి కొట్టి చంపినట్లు తెలిపారని పేర్కొన్నారు. అదేరోజు అర్ధరాత్రి ట్రాక్టర్ డ్రమ్ము స్టాండ్‌పై దామోదర్‌గౌడ్ మృతదేహం, అతని బైక్‌ను కుడికిళ్ల సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో పడేయగా మృతదేహం కాల్వగుండా కొట్టుకొచ్చి సింగోటం చెరువులో తేలినట్లు తెలిపారు. హత్యకు వెంకటమ్మ బంధువు పెబ్బేటి వెంకటస్వామి కూడా సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వెల్లడించారు. మృతదేహం తరలించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కొల్లాపూర్ సీఐ మహేష్, పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్ ఉన్నారు.

విద్యుదుత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన శ్రీశైలం ఈఓ


విద్యుదుత్పత్తి కేంద్రంలో ఆలయ ఈఓ, కేంద్రం సీఈ, ఎస్‌ఈలు

దోమలపెంట: భూగర్భ జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని మంగళవారం శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు సందర్శించారు. ఆయనకు కేంద్రం చీఫ్ ఇంజినీర్ కేవీవీ సత్యనారాయణ, ఎస్‌ఈ (సివిల్) రవీంద్రకుమార్, ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, డీఈ (కేంద్రం సేఫ్టీ) శ్రీకుమార్‌గౌడ్ స్వాగతం పలికి సత్కరించారు. కేంద్రంలో విద్యుదుత్పత్తి, విద్యుత్‌ను టీజీ లోడ్ డిస్పాచ్‌కు సరఫరా చేస్తున్న విధానాన్ని సీఈ ఆలయ ఈఓకు వివరించారు. అనంతరం సమావేశ మందిరంలో ఈఓ కేంద్రం సీఈ, ఎస్‌ఈలు, డీఈ, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ రవి, ఎస్‌పీఎఫ్ ఎస్‌ఐ అనూప్‌ను దేవస్థానం కండువాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. భూగర్భ కేంద్రానికి అవసరమైతే ఆలయ వేద పండితుల సహకారం అందిస్తామన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన కానిస్టేబుల్

డీఎస్పీని ఆశ్రయించిన యువతి

గద్వాల క్రైం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ ఓ కానిస్టేబుల్ తనను మోసం చేశాడని.. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ ఓ యువతి మంగళవారం గద్వాల డీఎస్పీ మొగిలయ్యను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. భద్రాది కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బోరంతపల్లికు చెందిన ప్రియాంక 2023లో ఉద్యోగ పోటీ పరీక్షల శిక్షణకు హైదరాబాద్‌కు రాగా.. గట్టు మండలం చిన్నోనిపల్లికి చెందిన రఘునాథ్‌గౌడ్ సైతం శిక్షణ కోసం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వివాహం చేసుకుందామంటూ రఘునాథ్‌గౌడ్ యువతి తల్లిదండ్రులను ఒప్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత తమ తల్లిదండ్రులతో మాట్లాడి వివాహం చేసుకుందామని నమ్మించారు. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం రాగా వివాహం చేసుకుందామని ఫోన్‌లో సంప్రదించగా దాటవేస్తూ వచ్చారని బాధితురాలు చెప్పారు. ఈ నెల 17న రఘునాథ్‌గౌడ్ ఇంటికి వెళ్లి వివాహ విషయం మాట్లాడగా కుటుంబ సభ్యులు నిరాకరించడంతో పాటు తనపై చేయి చేసుకున్నట్లు డీఎస్పీకి వివరించింది. తీవ్ర మనస్తాపానికి గురై వారి ఇంటి ముందే నిద్రమాత్రలు మింగగా స్థానికులు గుర్తించి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాప్రాయం తప్పిందని తెలిపింది. మంగళవారం ఉదయం కూడా మరోమారు వారి తల్లిదండ్రులతో మాట్లాడేందుకు కుటుంబంతో కలిసి వెళ్లగా నిరాకరించారన్నారు. ప్రస్తుతం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రఘునాథ్‌గౌడ్, దాడి చేసిన కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాధిత యువతి, తల్లిదండ్రులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేశాం..

బాధితురాలి ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌పై గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదైందని డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. కానిస్టేబుల్‌ను విచారించి తగిన చర్యలు తీసుకుంటామని.. మోసం చేసిన వ్యక్తి ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. బాధితురాలికి అన్నివిధాలా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

30 జీవాలు మృత్యువాత

జడ్చర్ల: మండల పరిధిలోని తుపుడగడ్డతండాలో సోమవారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 30 గొర్రెలు మృత్యువాత పడగా, 15 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు యజమాని లష్కర్‌నాయక్ తెలిపారు. తండా సమీపంలో రోజు మాదిరిగానే గొర్రెలను దొడ్డిలో ఉంచి ఇంటికి వెళ్లిన సమయంలో అర్ధరాత్రి కుక్కలు పెద్ద సంఖ్యలో దాడి చేశాయన్నారు. గొర్రెల మృతితో దాదాపు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాధితుడిని ఫోన్‌లో పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ యాదయ్య, నాయకులు ఇమ్ము, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.


కొల్లగొట్టిన ఫేస్‌బుక్ పరిచయం

రాజోళి: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మహిళను నమ్మి రూ.8 లక్షలు మోసపోయిన ఘటన శాంతినగర్‌లో చోటు చేసుకుంది. శాంతిగనర్ ఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన వెంకటేష్‌కు ఫేస్‌బుక్‌లో ఓ మహిళ పరిచయమైంది. గోల్డ్ బ్లాక్‌చైన్ యాప్‌లో పెట్టుబడి పెడితే 20 శాతం బెనిఫిట్ వస్తుందని చెప్పడంతో వెంకటేష్ రూ.8 లక్షలు డిపాజిట్ చేశాడు. కాగా యాప్‌లో అతనికి 34 లక్షల క్రెడిట్ అయినట్లు చూపించి డబ్బులు డ్రా చేయాలంటే రూ.15 లక్షల టాక్స్ పడుతుందని అవి చెల్లించాలని ఫోన్‌లో చేసింది. ఈ నేపథ్యంలో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు 1930ను సంప్రదించాడు. శాంతిగనర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మోడల్ స్కూల్.. కంపు కంపు

దుర్గంధ భరితంగా మారిన బాత్‌రూంలు

- పాఠశాల గదుల్లోకి చేరుతున్న మురుగు
- నాలుగు రోజులుగా స్నానం చేయని హాస్టల్ విద్యార్థినులు
- నీటి లీకేజీలతో చెమ్మగిల్లుతున్న గోడలు
- కన్నెత్తి చూడని అధికారులు


హాస్టల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తున్న విద్యార్థినులు


ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ కంపు కడుతోంది. హాస్టల్ విద్యార్థినులు కనీసం స్నానం చేయడానికి కూడా వీల్లేని విధంగా బాత్‌రూంలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. విద్యార్థినులు బాత్‌రూంల వైపు వెళ్లలేక నాలుగు రోజులుగా స్నానం చేయడం మానేశారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధన్వాడ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థినుల కోసం హాస్టల్ ఏర్పాటుచేయగా.. మొత్తం 100 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. అయితే పాఠశాలలోని బాత్‌రూంలు, మరుగుదొడ్లకు మరమ్మతు చేయించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. వాటి నుంచి నీరు బయటికి వెళ్లడం లేదు. ఎవరైనా బాత్‌రూం, మరుగుదొడ్లను వినియోగిస్తే నీరంతా విద్యార్థినులు ఉండే గదుల్లోకి చేరుతుండటంతో కంపు కొడుతున్నాయి. విద్యార్థినులు హాస్టల్ గదుల్లో ఉండలేక.. బయటికి వెళ్లలేక నరకం చూస్తున్నారు. తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థినులు ఆరుబయటే నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే, పాఠశాలలోని వాటర్ సంపును శుభ్రం చేయించకపోవడంతో కప్పలు, పురుగులు చేరాయి. ఆ నీటితోనే విద్యార్థినులు వినియోగిస్తుండటంతో చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయి. హాస్టల్‌లో ఉంటున్న వారిలో దాదాపు 50శాతం మంది విద్యార్థినులు చర్మవ్యాధుల బారిన పడ్డారు. కాగా, విద్యార్థినులు తమ ఇబ్బందులను పాఠశాల ప్రిన్సిపాల్‌కు తెలియజేస్తే.. హాస్టల్ నిర్వహణ మొత్తం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి చూస్తున్నారని.. అక్కడికి వెళ్లి సమస్యలను పరిష్కరించుకోవాలని చెబుతున్నారని విద్యార్థినులు వాపోతున్నారు.

హాస్టల్ ఎదుట బైఠాయించి నిరసన

మోడల్ స్కూల్ హాస్టల్‌లో సరైన వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం హాస్టల్ ఎదుట విద్యార్థినులు బైఠాయించి ఆందోళనకు దిగారు. పాఠశాలలో నీటి లీకేజీల కారణంగా గోడలు చెమ్మగిల్లుతున్నాయి. ఫలితంగా విద్యుత్ సరఫరా అయి షాక్ కొడుతున్నాయి. విద్యార్థినులు నిద్రించే మంచాలు ఇనుపవి కావడంతో షాక్‌కు గురవుతున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతు చేయించకపోవడంతో వినియోగించలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయిస్తాం..

మోడల్ స్కూల్ హాస్టల్‌లో మరుగుదొడ్లు, వాష్‌రూంలు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు మా దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే మరుగుదొడ్లు, స్నానాల గదులకు మరమ్మతు చేయిస్తాం. విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. – గంగమ్మ, కేజీబీవీ ఎస్‌ఓ


నీరు లీకేజీ అవుతున్న పాఠశాల పైకప్పు


బాత్‌రూంలో నిలిచిన నీరు